# రక్తపు మరకలు

కోడి కుయ్యగానే వెంకటయ్యకు మెలకువ వచ్చింది. దొడ్లో ఆవు మెడకు కట్టినమువ్వలు వినపట్టంలేదు. వెంకటయ్య ఉలిక్కిపడి లేచాడు — కుక్కి మంచంలో నుంచి, మంచానికి ఆనిచ్చి పెట్టుకున్న కర్రచేత్తో తీసుకొని, కిర్రుచెప్పుల్లోకి కాలుదూర్చి. గొడ్ల చావిడిలోకి నడిచాడు. గొడ్లచావిడి ఇంకా చీకటిగానేవుంది. ఆవు మెడకు కట్టిన మువ్వలు వినపడటంలేదు. భయంకరమైన నిశ్శబ్దం. చీకటిని చీల్చుకొని చూశాడు కట్టుగొయ్య దగ్గర ఆవులేదు. అతని గుండె గుభేలుమన్నది. పలుపు తెంపుకొని యెక్కడికో వెళ్ళిందిఆవు. ఎక్కడికి వెళ్ళివుంటుంది?

మొదట్లో విడిచి పెట్టినా చావిడి విడిచేది కాదు ఆవు. రాత్రిళ్లు తిరగటం, తానే నేర్పాడు ఆవుకి. తనకు ఆ ఆవంటే యెంతో ప్రాణం. అది బాగా బలసి నిగనిగలాడుతూ వుండాలని అతని అపేక్ష. కాని దాన్ని తా నెంతని మేపగలడు! అందుకని రాత్రిళ్ళు తానే విడిచిపెట్టే వాడు _దొంగతిండి తినిరమ్మని. మొదట్లో యజమాని అభిప్రాయం ఆ ఆవు గ్రహించలేక పోయింది. మెడ నుంచి పలుపు ఊడదీసినా కదలకుండా అలాగే నిలబడేది. చావిడిలోనుంచి బయటకు

తోలి తలుపువేస్తే, 'అంబా, అంబా' అని అరుస్తూ తలుపు దగ్గరే నిలబడి వుండేది. నెమ్మది నెమ్మదిగా తానే అలవాటు చేశాడు – ప్రక్కనున్న పొలాల్లో మెయ్యటం. ఆ ఆవు దొంగ మేత రుచి మరిగింది. పలుపు విప్పగానే తోక పైకెత్తి బయటకు పరుగెత్తేది. రాత్రులంతా యెక్కడెక్కడో మేసి, తెల్లవారక ముందే సంగనాచికిమల్లే వచ్చి, కట్టుగొయ్య దగ్గర నిలబడేది. తాను లేచి బురద తుడిచి కట్టివేసేవాడు.

తెల్లవారి యెవ్వరైనా ఈ రాత్రి యే దొంగ గొడ్డో మా చేలోపడి మేసిపోయిందని దుమ్మెత్తి పోస్తుంటే— “ఊరుకో, జరిగిందానికి యేం చేస్తాం? ఇంతకీ రోజులు మారిపోయినై. ఎవ్వరిని అంటాం?” అనేవాడు. ఇలా పట్టుబడకుండా జరిగింది కొన్నాళ్ళు. చేసేపనిని బట్టి ఆ ఆవు కూడా అనేక పోకిళ్లు నేర్చుకుంది.

రోజులు గడిచి పోతున్నాయి. ఒకనాడు వీరయ్య అనే రైతు కాపేసి రాత్రి దొంగమేతకువచ్చిన ఆవును పట్టుకున్నాడు. వెంకటయ్య ఇంటికి తోలుకువచ్చి, వెంకటయ్యనూ అతని భార్యనూ లేపాడు. నోటికివచ్చిన తిట్లన్నీ తిట్టాడు. ఏమీ అనలేక వెంకటయ్య “నేను గట్టిగా కట్టేశానయ్యా, అదే తెంపుకుపోయింది.” అన్నాడు.

“అదే తెంపుకు పోయిందీ! సరే ఈసారి చేలో పడనియ్, కాళ్ళు విరగగొట్టి మాదిగింటికి తోలతాను_దానితాత ఎవ్వడు అడ్డంవస్తాడో” అన్నాడు వీరయ్య.

ఆనాటి నుంచీ ఆవుని కట్టివేశాడు వెంకటయ్యా, రాత్రిళ్లు దొంగమేతకు విడిచిపెట్టేవాడుకాదు. కాని అలవాటు పడ్డ ప్రాణం అదెక్కడ వూరుకుంటుంది! అప్పుడప్పుడూ తెంపుకు పోతూ వుండేది; తెల్లవారేపాటికి కట్టుగొయ్య దగ్గరకు వచ్చి నిలబడి వుండేది.

మరి ఇప్పు డేమైనట్లు? తెల్లవార వచ్చినా పశువు తిరిగి రాలేదు. వెంకటయ్యకు అనుమానం కలిగింది. ఇంట్లోకి వెళ్ళి భార్యను లేపాడు, జరిగింది చెప్పాడు.

"ఊఁ, నామాట మొదలే వింటే" అన్నది ఆవిడ.

"ఏమాటే," అన్నాడు వెంకటయ్యా.

"ఆమాటే, రాత్రిళ్ళు దాన్ని విడిచి పెట్టొదంటే నామాట విన్నావ్? దానికి నువ్వే దొంగమేత నేర్పితివి. నేర్చుకుంది ఇప్పుడు మానుకోమంటే మానుకొంటుందా? అనుభవించు" అన్నది; మళ్ళీ పడుకుంది.

వెంకటయ్యకు యేమీ తోచలేదు. కళ్ళల్లో వొత్తులు పెట్టుకుని తెల్లవారేదాకా కూర్చున్నాడు. తెల్లవారగానే ఆవును వెతుక్కుంటూ బయలుదేరాడు. ఎక్కడుంది? వూరు వెతికాడు; చేలు వెతికాడు; ఆవు జాడలేదు. తిరిగి వొస్తుంటే పెదసుబ్బయ్యగారి చినవెంకయ్య కనుపించాడు.

"ఏమే, ఎక్కడినుంచి?" అన్నాడు చినవెంకయ్యా.

"గొడ్డు కనపడలేదురా అబ్బాయి!" అన్నాడు.

"ఆవేనంటే?"

"అవునురా అబ్బాయి."

"నేనిటు వస్తుంటే మనబుచ్చిగాడు నీ ఇటిముందు నుంచుని నానా బండబూతులూ కూస్తున్నాడు. రాత్రి వాడి చేనంతా దొంగ గొడ్డేదో మేసిపోయిందట. నీ వేఆనేమోనే" అన్నాడు చినవెంకయ్య.

ఈ మాటల్తో వెంకటయ్య మనస్సు గతుక్కుమంది. గబగబా ఇంటికి వెళ్దాం అనుకున్నాడు. కాని మొహం చెల్లలేదు. అసలే బుచ్చిగాడి నోరు మంచిదికాదు. తను కంటపడితే ఏమేమికూస్తాడో! ఎన్ని అనరాని మాటలుఅంటాడో! వూళ్ళోకి వెళ్ళకుండా, ఏదో పని వున్నవాడికిమల్లే చేనుదగ్గరకు వెళ్ళాడు. గట్టుమీద కూర్చున్నాడు. కళ్ళవెంట నీళ్ళు తిరిగినై. తనఆవుస్వభావసిద్ధంగా అతిసీతి గలిగిన గొడ్డు. దాని మనస్సు నతనే మార్చాడు. ఇప్పునిడది తనవశం తప్పింది. తను గ్రామస్థులకు మొహం చూపేది ఎట్లా? చూపక చేసేది ఏముంది? అన్నపు వేళకు యింటికి బయలుదేరాడు. ఇల్లు బావురుమంటూ వుంది.

"ఏమే?"

"వాచ్చా!" అన్నది భార్య, "దానితోపాటు నువ్వూ పోయావేమో అనుకున్నా."

"ఏమయిందే?" అన్నాడు వెంకటయ్య.

"ఇంకేం అవ్వాలి? ఆ బుచ్చయ్య ఇంత నోరు చేసుకు వచ్చి ఇంటిమీద పడ్డాడు. రాత్రి వాడి చేను ఏదో గొడ్డు మేసిపోయిందట. అది మన దేనట. ఊళ్ళో పెద్దమనుష్యు లందర్నీ తీసుకువచ్చి పంచాయితీ పెట్టాడు."

"ఏమన్నా రే?"

"పది రూపాయలు కట్టమన్నారు వాడి ఎదాని."

"ఇంతకీ గొడ్డెక్కడుందే?"

"ఏమో ఎక్కడుందో."

వెంకటయ్య మాట్లాడకుండా వెళ్ళి పడుకున్నాడు— నుక్కమంచంలో. తన ఆవు కళ్ళల్లో మెదిలింది.

"వాసేయ్!" భార్యను పిలిచాడు.

"ఏం?"

"కోడిగుడ్లూ, పెరుగూ అమ్ముతుంటివి గదే, ఆడబ్బు ఎక్కడ పెటావ్."

"తీసుకువెళ్ళి, వాడి ఎదాన వేసి వస్తావా?" అన్నది భార్య.

"మరి గొడ్డును తోలుకొచ్చుకోవాలి గదే."

"ఏమో, ఏం చేస్తావో! నన్నుమాత్రం అడక్కు" అన్నది భార్య.

వెంకటయ్య భార్యకు నయానా భయానా చెప్పి చూశాడు. కాని ఆమె వినలేదు. 'ససేమిరా అంటే ససేమిరా' అంది. 'ఇస్తావా, ఇవ్వవా?' అన్నాడు వెంకటయ్య వొళ్ళు తెలియని కోపంతో.

"ఇవ్వను" అన్నది భార్య.

కోపం పట్టలేకపోయాడు వెంకటయ్య. చెంపమీద ఛడేలున వొకట్టి వేశాడు. తన భార్య డబ్బు యెక్కడ దాచేదీ అతనికి తెలుసు. ఉట్టిమీద వున్న పిడత తీసి, డబ్బులు తీసుకొని బుచ్చయ్య యింటికి వెళ్ళాడు. అతను నోరుచేసుకుంటూ వుంటే యీ సారికి తప్పకాయమని ప్రాథేయపడ్డాడు. బొడ్డువిప్పి పదిరూపాయిలూ సమర్పించు కున్నాడు. ఆవు బందెలదొడ్లో వుందని తెలుసుకున్నాడు. అక్కడ కట్టవలసిన డబ్బు కట్టి, ఆవుని తోలుకొచ్చుకోటా నికి లోపలకు వెళ్ళాడు. తన ఆవుని చూచి నిలువుగుడ్లువేసి నిలబడ్డాడు. ఆవు వొంటినిండా రక్తపు మరకలే. దుర్మార్గుడు బుచ్చయ్య గొడ్డుని చావమోదాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. ఆవు పసికట్టినట్టుంది; గిరుక్కున తిరిగింది. యజ మానిని చూసింది. 'అంబా' అని అరిచింది—వొక్కసారి. ఆ అరుపు శూలులా దిగబడింది వెంకటయ్య హృదయంలోకి. కండ్లవెంట జొటజొట కన్నీరు కారుస్తూ "తప్పు నీదికాదు—

నాది: నా పాపం నువ్వు మోస్తున్నావు! వొచ్చే జన్మకు నీ బిడ్డనై పుట్టి నీ ఋణం తీర్చుకుంటాను" అన్నాడు - ఆవు మేను సవరిస్తూ. ఆవు తెలుసుకున్నట్టే తనూ కన్నీరు కార్చింది.